249) శుద్ధవసంతం

ప॥ మాయ కిదె సహజము మాయను గెలువరాదు । మాయానాథు గొలిచితే మన్నించు నాతడే ॥

చ॥ చేతికి లోతైనట్టుండు సృష్టిలోని వేడుకలు । పోతరించి పట్టబోతేబోవు నట్టదే ।
ఆతుమలో వేసరి అలసి వూరకుండితే । వైతాళపునీడవలె వచ్చు వెంటవెంటను ॥

చ॥ తీపువలెనే వుండు దిష్టపుబడార్థాలు । మేపుగొంటే మీసాలమీదితేనౌను ।
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను । మూపున గట్టినచద్ది మోపించును ॥

చ॥ తలపులోనే వుండు తనలోని యంతరాత్మ । తెలుపుకోబోతే పెక్కుదేవతలౌను ।
చలపట్టి యీతనినే శరణని కొలిచితే । యెలమి శ్రీవేంకటేశు డీతడై రక్షించును ॥